క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత



పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల

నల్లగొండ టూటౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు శేషమ్మగూడెం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త గాదరి ఆనంద్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని సోమవారం నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు.

నకిరేకల్ : పట్టణంలోని శివాలయం వీధిలో నివాసం ఉంటున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు మామిడికాయల నాగయ్య కాలికి శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. కాగా సోమవారం నాగయ్యను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ పరామర్శించి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు.

కంపచెట్ల తొలగింపు

గట్టుప్పల్ : మండల పరిధిలోని వెల్మకన్నె గ్రామం నుంచి కొంపెల్లి గ్రామానికి వెళ్లే దారిలో రోడ్డు కంపచెట్లతో నిండిపోయింది. దీంతో ఈ దారిగుండా వెళ్లే సమయంలో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆ గ్రామ యువకుల కోరిక మేరకు కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు రావుల రమేష్ తన సొంత ఖర్చులతో జేసీబీతో రోడ్డు వెంట కంపచెట్లను తొలగింపజేయించారు.

ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు

కట్టంగూర్ : చెరువుఅన్నారం గ్రామంలో గల శ్రీ కోదండ రామస్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరైనట్లు ఆ గ్రామ మాజీ సర్పంచ్ నంద్యాల రమాదేవి వెంకట్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సహకారంతో దేవాదాయ శాఖ సీజీఎఫ్ నిధులను ప్రభుత్వం మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.

వ్యాక్సినేషన్ చేయించాలి

చిట్యాల: పెంపుడు జంతువులకు తప్పనిసరిగా వ్యాక్సినేషన్(రేబిస్ వ్యాధి నివారణ టీకా)ను చేయించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ జి.వి.రమేష్ అన్నారు. జూనోసిస్ డే సందర్భంగా చిట్యాలలోని పశు వైద్య ఆస్పత్రిలో సోమవారం పెంపుడు జంతువులకు రేబిస్ వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా చిట్యాలలో 61 కుక్కలకు రేబిస్ వ్యాధి నివారణ టీకాలను పశువైద్య సిబ్బంది వేశారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారులు డాక్టర్ అభినవ్, డాక్టర్ అమరేందర్, పశువైద్య సిబ్బంది సైదులు, శ్రీనివాస్, మల్లారెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

శాలిగౌరారం: మండలంలోని మాధారంకలాన్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సోమవారం పీఏసీఎస్ చైర్మన్ తాళ్ళూరి మురళి భూమి పూజ చేశారు. గృహ నిర్మాణ శాఖ ఏఈ యుగంధర్‌రాజ్, పంచాయతీ కార్యదర్శి బండారి శివ, మాజీ ఎంపీటీసీ నోముల జనార్దన్, పరుశరాం, రవి, శ్రీను పాల్గొన్నారు.

కార్మికులందరికీ చేనేత భరోసా ఇవ్వాలి

నల్లగొండ టౌన్: చేనేత కార్మికులందరికీ చేనేత భరోసా ఇవ్వాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్ డిమాండ్ చేశారు. సోమవారం నల్లగొండలో తెలంగాణ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేత కార్మికుడికి రూ.18 వేలు, అనుబంధ వృత్తి కార్మికులకు రూ.6 వేలు అమలు చేయాలని కోరారు. ఎలాంటి నిబంధనలు లేకుండా ప్రతి చేనేత కార్మికుడికి లక్ష రూపాయలు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో చేనేత యారన్ డిపో ఏర్పాటు చేయాలన్నారు. పేరుకుపోయిన చేనేత వస్త్ర నిల్వలను ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కందగట్ల గణేశ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు కర్నాటి వెంకటేశం, గంజి నాగరాజు, కర్నాటి శ్రీరంగం, దశరథ, రాపోలు వెంకన్న, శ్రీవాణి, ఏలే శ్రీనివాస్, రాజేష్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

మర్రిగూడ: మండలంలోని ఖుదాబాక్షపల్లి గ్రామంలో రెండు రేషన్ షాపులు ఒకే డీలర్ నిర్వహిస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రజలు ఇబ్బందులు తొలగించాలని ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి ఇస్కిళ్ల మహేందర్ సోమవారం తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ గ్రామశాఖ కార్యదర్శి మేతరి యాదయ్య తదితరులు ఉన్నారు.

యూరియా పంపిణీ చేయరూ..

గట్టుప్పల్ : మండలంలోని తేరట్‌పల్లి గ్రామ పరిధిలో గల రైతు సేవా సహకార సంఘానికి సంబంధించిన గోదాములో సహకార సంఘం ఆధ్వర్యంలో తెప్పించి నిల్వ చేసిన యూరియాను అధికారులు పంపిణీ చేయడం లేదు. సుమారు 20 రోజుల క్రితం 444 బస్తాల యూరియాను సంఘం తరపున రైతులకు పంపిణీ చేసేందుకు అధికారులు గోదాంలో నిల్వ చేశారు. ఇటీవల అడపాదడపా వర్షాలు పడుతుండడంతో రైతులు వ్యవసాయ సాగు పనులకు సన్నద్ధం అవుతున్నారు. అయితే గోదాంలో నిల్వ ఉన్న యూరియాను అధికారులు పంపిణీ చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైతులు చుట్టు పక్కల మండల కేంద్రాలకు వెళ్లి యూరియా తెచ్చుకుంటున్నారు. గోదాంలో నిల్వ చేసిన యూరియాను అధికారులు పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత

- తిప్పర్తి గ్రామపంచాయతీలో నరిపడా లేని కార్మికులు
- ఎక్కడికక్కడ పేరుకుపోతున్న చెత్తాచెదారం, పారిశుద్ధ్యం
- మల్టీపర్పస్ వర్కర్లకు పెరిగిన పనిభారం



పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు

తిప్పర్తి : పారిశుద్ధ్య కార్మికుల కొరతతో తిప్పర్తి గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. వీధుల్లో చెత్తాచెదారం, డ్రెయినేజీల్లో మురుగు ఎక్కడికక్కడ పేరుకుపోతోంది. తిప్పర్తి గ్రామ పంచాయతీలో సుమారు 6వేల జనాభా ఉన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో మొత్తం ఆరు ఆవాసాలు ఉన్నాయి. చిన్నాయిగూడెం, పాల్వాయిగూడెం, తిప్పలమ్మగూడెం, ఎస్‌ఎల్‌బీ కాలనీ, నూకలవారిగూడెం, సైదబాయిగూడెం ఆవాస గ్రామాలు ఉన్నాయి. గ్రామ పంచాయతీ కార్యాలయంలో మొత్తం శానిటరీ సిబ్బంది ఆరుగురు మాత్రమే పనిచేస్తున్నారు. మొత్తం గ్రామ పంచాయతీలో 12 వార్డులకుగాను ఆరు ఆవాసాల్లో కలిపి 6 కిలోమీటర్ల డ్రెయినేజీ ఉంది. సరిపడా పారిశుద్ధ్య సిబ్బంది లేకపోవడంతో వీధుల్లో చెత్త పేరుకుపోతోంది.

ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా పనిచేస్తుండడంతో..

తిప్పర్తి గ్రామపంచాయతీలోని 12 వార్డులతోపాటు ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా మల్టీపర్పస్ వర్కర్లు పని చేయాల్సి వస్తోంది. ప్రభుత్వ పాఠశాలలు 4, ఉన్నత పాఠశాలలు 2, అంగన్‌వాడీ కేంద్రాలు 5, పోలీస్‌స్టేషన్, ఆరోగ్య కేంద్రం, సబ్‌సెంటర్‌లు, పశువైద్యశాల, ఇతర ప్రభుత్వ కార్యాలయాలు, 3 సంక్షేమ వసతి గృహాల్లో కూడా పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారు. ఆరుగురు కార్మికులు మాత్రమే ఉండడంతో వారికి పూర్తిస్థాయిలో పని చేయలేకపోతున్నారు.

సిబ్బంది తక్కువగా ఉండడంతో..

ఆరుగురు పారిశుద్ధ్య కార్మికులతోపాటు ఒకరు చెత్త సేకరణ ట్రాక్టర్ డ్రైవర్, మరొకరు వాటర్ ట్యాంకర్‌కు డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ముగ్గురు వాటర్ మెన్‌లు ఉన్నారు. మిషన్ భగీరథ పైపులైన్ సుమారు 20 కిలోమీటర్ల మేర ఉంటుంది. 30 గేట్ వాల్వ్‌ల ఆపరేటింగ్ నిత్యం చేయాల్సి ఉంది. 9 ఓవర్‌హెడ్ ట్యాంకులు, 6 జీఎస్‌ఎల్‌ఆర్ ట్యాంకులు ఆపరేటింగ్ చేయాల్సి ఉంటుంది. గ్రామపంచాయతీలో నీటి సరఫరాకు నిత్యం 30 మోటార్లులు పని చేస్తుంటాయి. గ్రామ పంచాయతీలో స్తంభాలకు 600లకు పైగా విద్యుత్ దీపాలు ఉన్నాయి. వీటన్నింటి నిర్వహణకు సిబ్బంది తక్కువగా ఉండడంతో తిప్పర్తి గ్రామపంచాయతీలో సమస్యలు ఎక్కడికక్కడ పేరుకుపోతున్నాయి. కార్మికులకు కూడా పనిభారంగా మారింది. సిబ్బందిని పెంచి గ్రామ పంచాయతీలో సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కార్మికులు నిత్యం శ్రమిస్తున్నారు

తిప్పర్తి మేజర్ గ్రామపంచాయతీ కావడంతోపాటు ఆవాసాలు ఎక్కువగా ఉండడం, ప్రభుత్వ కార్యాలయాలు ఉండడం వల్ల సిబ్బంది కొరతతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆరు కిలోమీటర్ల డ్రెయినేజీ ఉండడంతో ఒక పక్క తీస్తుంటే మరోపక్క నిండిపోతోంది. చెత్త సేకరణ, పారిశుద్ధ్య పనులు, ప్రభుత్వ కార్యాలయాల శుభ్రత పనులతో నిత్యం కార్మికులు శ్రమిస్తున్నారు. సిబ్బందిని పెంచినట్లయితే కొంత వెసులుబాటు కలుగుతుంది.

–నర్సింహస్వామి,
పంచాయతీ కార్యదర్శి, తిప్పర్తి

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



నకిరేకల్: సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

కేతేపల్లి: అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. కేతేపల్లి మండలంలోని బండపాలెం, కొండకిందిగూడెం, చెర్కుపల్లి, తుంగతుర్తి, కొత్తపేట, చీకటిగూడెం, కొర్లపహాడ్ తదితర గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇళ్లు రాలేదని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మొదటి విడతలో ఇళ్లు మంజూరైన వారు తక్షణమే ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. చెర్కుపల్లిలో జరిగిన ఇళ్ల శంకుస్థాపన కార్యక్రమంలో శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్ పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎన్‌డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, నకిరేకల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్త మంజులమాధవరెడ్డి, ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, ఏఓ బి.పురుషోత్తం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌యాదవ్, మాజీ జెడ్పీటీసీ కోట మల్లికార్జునరావు, బొజ్జ సుందర్, జటంగి వెంకటనర్సయ్యయాదవ్, కోట పుల్లయ్య, కోట వెంకటేశ్వరావు, మండడి వెంకట్రాంరెడ్డి, కె.మహేందర్‌రెడ్డి, ఎం.ప్రవీణ్‌రెడి, గన్న సోమయ్య పాల్గొన్నారు.

ఎరువుల కొరత లేకుండా చూడాలి

నకిరేకల్: వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున రైతులకు ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చూడాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సూచించారు. నకిరేకల్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గంలోని వివిధ మండలాల పీఏసీఎస్ చైర్మన్లు, సీఈఓలు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అన్ని కేంద్రాల్లో రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ సమావేశంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు నాగులంచ వెంకటేశ్వరరావు, నంద్యాల భిక్షంరెడ్డి, ఎనుగు రఘుమారెడ్డి, రేగట్టె నారాయణరెడ్డి, సీఈఓ నాగరాజు పాల్గొన్నారు.

పది గంటల పని విధానంపై నిరసన



కట్టంగూర్ : జీఓ కాపీలను దహనం చేస్తున్న యూనియన్ నాయకులు

నల్లగొండ టౌన్: కార్మికులు 10 గంటలు పని చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జీఓ 282ను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం, జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నల్లగొండ కార్మిక శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేసి జీఓ కాపీలు దహనం చేసిన అనంతరం మాట్లాడారు. కార్యక్రమంలో అవుట రవీందర్, అద్దంకి నరసింహ, కోట్ల అశోక్ రెడ్డి , విజయలక్ష్మి, సైదాచారి, పల్లె నగేష్, గంజి నాగరాజు, జంజరాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

జీఓ ప్రతులను దహనం

నకిరేకల్ : రోజుకు 10 గంటల పని విధానానికి రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలపుతూ జీఓ నంబర్ 282 జారీ చేయడాన్ని వ్యతిరేకిస్తూ నకిరేకల్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ఆ జీఓ ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వంటెపాక వెంకటేశ్వర్లు, గండమల్ల బాలస్వామి, పడిదల వెంకన్న, వంటెపాక సైదులు, శ్రీను, యాదగిరి, నరహరి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: ఎనిమిది గంటల పని విధానాన్ని రద్దు చేసి పది గంటల పని విధానాన్ని ఆమోదిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీఓ 282ను వెంటనే ఉపసంహరించుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వడ్డెగాని మహేష్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పెంచిన పని గంటల విధానాన్ని రద్దు చేయకపోతే డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

కట్టంగూర్ : రాష్ట్రంలో రోజుకు 10 గంటల పని విధానానికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలుపుతూ జారీ చేసిన జీఓ నంబర్ 282 ను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పెంజర్ల సైదులు డిమాండ్ చేశారు. సోమవారం కట్టంగూర్ మండల కేంద్రంలో జీఓ కాపీలను యూనియన్ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ 8 గంటల పని విధానం స్థానంలో 10 గంటల పని విధానాన్ని వ్యతిరేకిస్తూ కార్మిక, ఉద్యోగ వర్గాలు, ప్రజా సంఘాలు ఆందోళనకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీసీఎం డ్రైవర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు పాడిచేటి లింగయ్య, ఐతగోని రాజు, చింత ముత్యాలు, కొంపెల్లి నాగరాజు, పల్స నాగరాజు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి

చండూర్ : ఈ నెల 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండ శ్రీశైలం పిలుపునిచ్చారు. సోమవారం చండూరులో సమ్మెకు సంబంధించి వివిధ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో చంద్రమౌళి, యాదయ్య, వెంకటేశం , మల్లేష్, యాదయ్య, వెంకన్న, భిక్షమయ్య, బుచ్చిరెడ్డి, రాఘవేంద్ర, సైదులు, మధు, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్ : ఈ నెల 9న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి రాచకొండ వెంకట్‌గౌడ్ కోరారు. నకిరేకల్‌లో సోమవారం జరిగిన సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వంటిపాక వెంకటేశ్వర్లు, వంటిపాక కృష్ణ, ఏర్పుల తాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

తిప్పర్తి : పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తిప్పర్తి మండల ప్రత్యేక అధికారి చాయాదేవి అన్నారు. సోమవారం తిప్పర్తి మండల కేంద్రంలోని కస్తూరిబా ఆశ్రమ పాఠశాల, తెలంగాణ ఆదర్శ పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నాణ్యతగా పెట్టాలని, తాజా కూరగాయలతో వంట చేయాలని సూచించారు. ఆమె వెంట ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంఈఓ నర్సింహనాయక్, ప్రిన్సిపాల్ అపర్ణ తదితరులు ఉన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు



నల్లగొండ టౌన్: జెండా ఎగురవేస్తున్న నాయకులు



మునుగోడు: నినాదాలు చేస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, మందకృష్ణ జన్మదిన వేడుకలు సోమవారం నల్లగొండలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెపాక వెంకన్న ఎమ్మార్పీఎస్ జెండాలు ఎగురవేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ బోర్ర సుధాకర్, కూరపాటి కమలమ్మ, పెరికె శ్రీనివాసులు, లంకపల్లి నగేష్, ఊదరి వెంకటేశం, కత్తుల మారయ్య, కొత్త వెంకన్న జలంధర్, మాసారం వెంకన్న, బొజ్జ నాగరాజు, పెరిక నరసింహ, కత్తుల గిరి, కత్తుల యాదగిరి, కందుల మోహన్, దిబ్బ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కనగల్: మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కనగల్‌లో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు కందుల మోహన్ జెండా ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో దుబ్బ సత్యనారాయణ, దుబ్బ దేవేందర్, మల్లేపల్లి నరసింహ, గోపాల్, శంకర్, సైదులు, వెంకటేశ్వర్లు, యాదయ్య పాల్గొన్నారు.

చిట్యాల: మండలంలోని చిట్యాల, గుండ్రాంపల్లి గ్రామాల్లో సోమవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ జన్మదిన వేడుకలను ఎమ్మార్పీఎస్ నాయకులు నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో బుస్సు శ్రీకాంత్, పాల క్రిష్ణ, బుస్సు శంకర్, దుబ్బ కుమారస్వామి, బుస్సు మధుసూదన్, రెడపాక మల్లయ్య, బుస్సు శ్రీనివాస్, రెడపాక శంకర్, కాసర్ల రాజు, జిల్లా వెంకటేష్ పాల్గొన్నారు.

మునుగోడు: ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం మునుగోడులో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు బాబు జగ్జీవన్‌రామ్ భవనం ఎదుట జెండా ఎగురవేశారు. అనంతరం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ జన్మదినం సందర్భంగా ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేడి శంకర్, దుబ్బ గోపాల్, పందుల మల్లేష్, పందుల పర్వతాలు, అంజయ్య, లక్ష్మణ్, వెంకన్న, నర్సింహ, నరేష్, అశోక్, పురుషోత్తం, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

శాలిగౌరారం: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం , మంద కృష్ణ జన్మదిన వేడుకలను శాలిగౌరారం మండలంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్ ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మార్పీఎస్ జెండా ఎగురవేశారు. కారుపాటి అంబేద్కర్, బట్ట శ్రీను, సైదులు, ప్రతాప్, లక్ష్మినారాయణ, చింత ధనుంజయ్య, వేముల గోపినాథ్, బన్నీ, సాయి, అరవింద్, అశోక్, నాగరాజు, శ్రీకాంత్, రఘు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు



నకిరేకల్ : బాబాసాహెబ్‌గూడెంలో మొహర్రం వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్: మున్సిపాలిటీ పరిధిలోని బాబాసాహెబ్ గూడెంలో సోమవారం మొహర్రం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం వేడుకల్లో పాల్గొని మొహర్రం శుభాకాంక్షలు తెలిపారు. నిర్వాహకులతో కలిసి దూల ఆటలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే వెంట స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ కొండ శ్రీను ఉన్నారు.

కట్టంగూర్ : మొహర్రం వేడుకలను కట్టంగూర్ మండల ప్రజలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఎరసానిగూడెం, పరడ, బొల్లేపల్లి, ఈదులూరు, పిట్టంపల్లి, కట్టంగూర్, అయిటిపాముల గ్రామాల్లో పీర్లను ఊరేగించారు. భక్తులు కానుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అయా గ్రామాల్లోని బావుల్లో పీర్లను రాత్రి నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ముబీన్‌ఖాన్, సయ్యద్ షకీల్, షేక్ మన్సూర్, షబ్బీర్, నాగరాజు, సైదులు, శివ, మహమ్మద్ మెహరాజ్, అమీర్, సోహెల్, మున్ను, సమీర్, చాన్‌పాషా, ఆసిఫ్ అలీఖాన్ ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం

- ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



కార్యకర్తలతో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

మర్రిగూడ: ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ నిరంతరం పోరాటాలు సాగిస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. సోమవారం మర్రిగూడలో సీపీఐ మండల కౌన్సిల్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. పది సంవత్సరాల క్రితం ప్రారంభమైన డిండి ఎత్తిపోతల పథకం, శివన్నగూడెం రిజర్వాయర్ పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడ అనే చందంగా తయారైందన్నారు. ఎస్‌ఎల్‌బీసీ, డిండి, ఎత్తిపోతల పథకాలకు అధిక నిధులు కేటాయించి త్వరగా పనులు పూర్తి చేసి ప్రజలకు సాగు, తాగునీరు అందించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు భిక్షంరెడ్డి, మండల కన్వీనర్ బుర్ర శేఖర్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బూడిద సురేష్, ఎరుకల నిరంజన్, ఆకుల రఘుమయ్య, జక్కల అంజయ్య, ఇస్కిల్ల మహేందర్, శిరసవాడ నరసింహ, అల్వాల నరసింహ, కారింగు యాదయ్య, అయితగోని యాదయ్య, ముత్యాలు, లక్ష్మమ్మ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఫంక్షన్ హాల్ సీజ్

నల్లగొండ టూటౌన్: పట్టణంలోని శాంతినగర్‌లో గల బాలాజీ ఫంక్షన్ హాల్ నుంచి సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలను యూజీడీలోకి వదులుతుండడంతో స్థానికులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో సోమవారం మున్సిపల్ అధికారులు ఫంక్షన్ హాల్‌ను సీజ్ చేశారు. ఫంక్షన్ హాల్ యాజమాన్యం వారు సెప్టిక్ ట్యాంకు నుంచి వచ్చే వ్యర్థాలను అండర్ గ్రౌండ్ డ్రెయినేజీలోకి వదలడంతో అది నిండి పక్కనే ఉన్న నీటి వాల్వ్‌లోకి వెళ్లడంతో తాగునీరు కలుషితం అవుతోంది. దాంతో మున్సిపల్ సిబ్బంది శాంతినగర్ కాలనీకి తాగు నీటి సరఫరా నిలిపివేశారు. పైప్‌లైన్‌లో ఉన్న నీటిని బయటికి పంపిన తరువాత కాలనీకి తాగు నీరు సరఫరా చేస్తామని మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ తెలిపారు. సెప్టిక్ ట్యాంక్ నుంచి యూజీడీలోకి కనెక్షన్ ఇవ్వకూడదని, నిబంధనలు అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాని కమిషనర్ హెచ్చరించారు.

‘రాజకీయ లబ్ధి కోసమే రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారు’

నల్లగొండ: పట్టణంలోని కొంతమంది ముస్లిం నాయకులు వారి రాజకీయ లబ్ధి కోసం లతీఫ్ సాబ్ గుట్టపై రోడ్డు వేయకుండా అడ్డుకోవాలని చూస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రజాప్రతినిధులు మహమ్మద్ ఖయ్యూం బేగ్, మహమ్మద్ ఇబ్రహీం, సయ్యద్ సమద్, మహమ్మద్ బషీరుద్దీన్‌లు ఆరోపించారు. సోమవారం నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నల్లగొండను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి మంత్రి వెంకట్‌రెడ్డి లతీఫ్ సాబ్ గుట్ట, బ్రహ్మం గుట్టలకు రోడ్డు వేయడానికి రూ.140 కోట్లు మంజూరు చేయించారన్నారు. ఆదివారం కొంతమంది నాయకులు ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి మంత్రి కోమటిరెడ్డిపై ఇష్టానుసారంగా మాట్లాడారని అన్నారు. వక్ఫ్ బోర్డు భూముల్లో సుమారు 750 నుంచి 1000 వరకు ముస్లిం, ముస్లిమేతరులకు సంబంధించిన పేదలు ఉంటున్నారని తెలిపారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించిన ప్రకారం రోడ్డు వేస్తే పేదలు ఇళ్లు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఈ సమావేశంలో ఫసహత్ అలీ బాబా, మహమ్మద్ ఇర్ఫాన్, మహమ్మద్ మహబూబ్ అలీ, మహమ్మద్ అమేర్, మహమ్మద్ ఖలీల్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జహంగీర్ బాబా తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి

నల్లగొండ: బెస్టు అవైలబుల్ స్కీమ్ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట బెస్టు అవైలబుల్ స్కీమ్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి ధర్నా చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో బెస్ట్ అవైలబుల్ స్కీం విద్యార్థులకు ఎలాంటి నష్టం జరిగినా సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం సోషల్ వెల్ఫేర్ అధికారి శశికళకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బండారు శంకర్, కత్తుల శివ, టి.రవితేజ, రాజు, పేర్ల నరసింహ, కట్టా నవీన్, జి.శ్రవణ్, వెంకటేష్, నాగరాజు, ఎం.రజిత, మేడిపల్లి పల్లవి, అరుణ, మేడిపల్లి లక్ష్మీ, జానయ్య, జగన్, కార్తీక్, బండారు శంకర్, కత్తులు శివ, బొజ్జ సతీష్, బొజ్జ నాగరాజు, పేర్ల నర్సింహ, డి.రాజు, రవి, వెంకటేష్, యాదగిరి, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

కట్టంగూర్ : మండలంలోని మునుకుంట్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్ నల్లగొండ ఆధ్వర్యంలో సోమవారం సుమారు రూ.15 వేల విలువ చేసే నోటు పుస్తకాలు, స్టేషనరీ అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్ నల్లగొండ అధ్యక్షుడు మల్లారెడ్డి, సెక్రటరీ చిలుకూరి రామకృష్ణ , క్లబ్ సెక్రటరీ జానకిరెడ్డి, పురుషోత్తంరెడ్డి, అశోక్‌రెడ్డి, హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి, హైస్కూల్ హెచ్‌ఎం షమీమ్ బేగం పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: మండలంలోని ఏపీ లింగోటం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు తండు సైదులు తన తండ్రి యాదయ్య జ్ఞాపకార్థం సోమవారం డిక్షనరీలు, నోటుబుక్స్, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద గడ్డం పశుపతి, ఆర్.సత్యనారాయణ, ఎఫ్సిబా, కె.వినోద, వై.సత్యనారాయణ, డి.భాస్కర్, ఆదిమల్ల మణిరాజు, విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా చౌడంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆసరా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడి హరికృష్ణ సోమవారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు.

విద్యార్థులకు షూ అందజేత

చిట్యాల: మండలంలోని నేరడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ నల్లగొండ ఆధ్వర్యంలో క్లబ్ డిస్ట్రిక్ చైర్‌పర్సన్ సిలువేరు చంద్రావతి సోమవారం షూ, సాక్స్‌లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వల్లం నాగరాజు, స్నేహ క్లబ్ ప్రెసిడెంట్ కంభంపాటి విజయలక్ష్మీ, ట్రెజరర్ వట్టిపల్లి పద్మ, సెక్రటరీ మామిడి పద్మ, సభ్యులు జెల్లా ఇందిర, గోలి రజిని, బండారు పుష్ప, తిరునగరి శారద, ఉపాధ్యాయులు హేమలత, రంగా రామలింగయ్య, పోషం లింగస్వామి పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణపై శిక్షణ

చిట్యాల: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో చిట్యాల మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీఎల్‌ఓలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని రెవెన్యూ అధికారులు సోమవారం నిర్వహించారు. పద్దెనిమిదేళ్లు నిండిన వారిని నూతన ఓటరుగా నమోదు చేయించడం అంశాలపై బీఎల్‌ఓలకు శిక్షణ ఇచ్చారు. నియోజకవర్గ ఈఆర్‌ఓ వెంకటేశ్వర్లు, ఏఈఆర్‌ఓ కృష్ణనాయక్, డీటీ విజయ, ఏఎల్‌ఎంటి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మర్రిగూడ: మండల కేంద్రంలోని రైతు వేదికలో బూత్ లెవల్ అధికారులకు ఓటరు జాబితా సవరణపై ఆర్డీఓ వి.శ్రీదేవి ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ కొత్తగా నివాసం ఉంటున్న వారి పేర్లను జాబితాలో చేర్చాలని సూచించారు. తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు, డీటీ శేఖర్, ఆర్‌ఐలు, మాస్టర్ ట్రైనర్లు ఎం.వెంకటేశ్వర్లు, బాలరాజ్, పాల్గొన్నారు.

గోరింటాకు వేడుక



రాజీవ్‌పార్క్‌లో వేడుకల్లో పాల్గొన్న మహిళలు



చైతన్యపురి కాలనీలో..

నల్లగొండ టౌన్ : పట్టణంలోని హౌసింగ్ బోర్డులో గల రాజీవ్ పార్క్‌లో చిడతల భజన మండలి ఆధ్వర్యంలో సోమవారం గోరింటాకు ఉత్సవం ఘనంగా నిర్వహించారు. గురూజీ రామలింగయ్య, శ్రీదేవి, కేసని కవిత, గుమ్మడవెల్లి శ్రీదేవి, సుజాత, సుభాషిని, రజిత, పద్మ, లక్ష్మి, సుష్మా, సుజాత, విజయలక్ష్మి, స్వాతి, స్వరూప, జ్యోతి, రేణుక, పుచ్చకాయల శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా చైతన్యపురి కాలనీలో బోధియోగ ఫిట్‌నెస్ సెంటర్ ఆధ్వర్యంలో గోరింటాకు పండుగ నిర్వహించారు. నేషనల్ సర్టిఫైడ్ యోగా ట్రైనర్ సుష్మ, సునీత, రజిత, శ్రీదేవి, రేణుక, కళావతి, నిర్మల, సుజాత, భావన, అండాలు శిల్ప పాల్గొన్నారు.

నీటి మోటారు అపహరణ

కట్టంగూర్ : మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం రాత్రి నీటి మోటారు అపహరణకు గురైంది. పాఠశాలలోని ట్యాంకుకు నీటి సరఫరా చేసే ఓపెన్ వెల్ సబ్‌మెర్సిబుల్ మోటార్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకు పోయారని పాఠశాల హెచ్‌ఎం, ఎంఈఓ అంబటి అంజయ్య తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎంఈఓ తెలిపారు.

వ్యవసాయ బోరుమోటారు చోరీ

కట్టంగూర్ మండలంలోని నారెగూడెం గ్రామంలో ఆదివారం రాత్రి వ్యవసాయ బోరు మోటారు చోరీకి గురైంది. గ్రామానికి చెందిన రైతు దుప్పెల్లి భిక్షమయ్య సోమవారం తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లగా బోరు మోటారు కనిపించలేదు. విద్యుత్ వైర్లు కట్ చేసి ఉన్నాయి. మోటారు అపహరణకు గురైనట్లు గ్రహించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.